క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నేరేడుచర్ల : మున్సిపాలిటీలోని జాన్‌పహాడ్ రోడ్డులో పెద్ద మసీదు పక్కన గల సెంట్రల్ లైటింగ్‌కు విద్యుత్ కనెక్షన్ నిమిత్తం ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్నందున గురువారం పట్టణంలో ఉదయం 9 గంటల నుంచి 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు నేరేడుచర్ల ఇన్‌చార్జ్ ట్రాన్స్‌కో ఏఈ పందిరి శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు.

బేతవోలు సబ్‌స్టేషన్ పరిధిలో..

చిలుకూరు : బేతవోలు సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ లైన్‌కు మరమ్మతుల చేపడుతున్న గురువారం బేతవోలు, సీతారాంతండా, కొండాపురం ఫీడర్ల పరిధిలో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏఈ రామిశెట్టి శ్రీనివాస్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా శివాజీ


శివాజీకి నియామకపత్రం అందజేస్తున్న ఆర్.కృష్ణయ్య

మునగాల : బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా మునగాల మండల కేంద్రానికి చెందిన ముదిరాజ్ సంఘం నాయకుడు వేట శివాజీ నియమితులయ్యారు. ఈమేరకు బుధవారం హైదరాబాద్‌లోని బీసీ భవన్‌లో శివాజీకి సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివాజీ ముదిరాజ్ మాట్లాడుతూ.. బీసీ యువతను ఉద్యమంలోకి తీసుకొచ్చి బీసీ హక్కుల సాధనకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

సిటిజన్ ఫర్ రైట్స్ ప్రధాన కార్యదర్శిగా అమ్మునాయక్



చిలుకూరు : కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుకూరు మండల పరిధిలోని జానకీనగర్ గ్రామానికి చెందిన అమ్మునాయక్ నియమితులయ్యారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో జరిగిన కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ సమావేశంలో తనను నియమించినట్లు అమ్మునాయక్ తెలిపారు.

మృతుడి కుటుంబానికి పీఆర్‌టీయూ చేయూత


ఆర్థికసాయం అందజేస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

నేరేడుచర్ల : నేరేడుచర్లకు చెందిన ఉపాధ్యాయుడు ఎర్రగొర్ల గంగయ్య ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. బుధవారం మృతుడి భార్య పుష్పలతకు నేరేడుచర్ల పీఆర్‌టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో ఎంఈఓ పుట్లూరి సత్యనారాయణరెడ్డి, పీఆర్‌టీయూ నేత ప్రభాకర్‌రెడ్డి చేతుల మీదుగా రూ. 55 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు యడవల్లి సత్యనారాయణరెడ్డి, మాతంగి సైదులు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మామిళ్ల శ్రీనివాస్‌రెడ్డి, కందుల సైదులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు దీప్లా నాయక్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు చందమళ్ల వెంకన్న, ఉపాధ్యక్షుడు కిసర ప్రసాద్, ఎం.సత్యనారాయణ, కృష్ణయ్య, శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, విజయ్‌కుమార్, మాజీ సర్పంచ్ ప్రశాంత్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

అనాథ పిల్లలకు పూర్వ విద్యార్థుల సాయం


ఆర్థికసాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

మఠంపల్లి : మండల కేంద్రంలో తల్లిదండ్రులు లేని ముగ్గురు అనాథ పిల్లల చదువుకు స్థానిక మాంట్‌ఫోర్టు స్కూల్‌లో 1990- 91 సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు బుధవారం రూ.25 వేల ఆర్థికసాయం అందజేశారు. ప్రిన్సిపాల్ బ్రదర్ వినోద్ కుమార్‌రెడ్డి, ఉపాధ్యాయులు హనుమత్‌ప్రసాద్, పూర్వ విద్యార్థులు కుక్కడపు రామారావు, మార్తి వెంకటరమణశాస్త్రి, తదితరులు పాల్గొన్నారు.

కూలీలకు సాయం అందించాలి

నేరేడుచర్ల : ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ఉపాధి హామీ కూలీలకు ఏడాదికి రూ.12 వేలు ఆర్థికసాయం అందించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ధనుంజయనాయుడు డిమాండ్ చేశారు. బుధవారం తెలగరామయ్యగూడెంలో నిర్వహించిన సంఘం నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూలీలకు ఏడాదికి 200 రోజులు పనులు కల్పించాలని, రోజుకు రూ.700 కూలి ఇవ్వాలని కోరారు. సీనియర్ నాయకుడు సోమగాని వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి రావుల సత్యం, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను, ప్రసాద్, నరేష్, ప్రసాద్ ఉన్నారు.

కాలువ ఇలా.. సాగుకు నీరెలా!

- ఆక్రమణలో ఆర్-3 కాలువ
- కాలువలోనే వ్యర్థాలు పారబోత
- పూడిక తీయకపోవడంతో చివరి భూములకు అందని సాగు నీరు
- ఆధునీకరణ పనులు చేపట్టాలని రైతుల వేడుకోలు


నేరేడుచర్లలో ఇరుపక్కల ఆక్రమణకు గురైన ఆర్- 3 కాలువ


ఆర్- 3 కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలు

నేరేడుచర్ల : మండలంలోని జాన్‌పహాడ్ మేజర్ కాలువకు అనుబంధంగా ఉన్న ఆర్- 3 కాలువ నేరేడుచర్ల పట్టణంలో ఆక్రమణకు గురైంది. పట్టణంలో రెండు కిలో మీటర్ల మేర ఈ కాలువ సాగు సీజన్‌లో ప్రవహిస్తోంది. అయితే కాలువ ఇరువైపులా 38 ఫీట్ల మేర విస్తీర్ణం ఉండాల్సి ఉండగా కట్టలను ఆక్రమించుకొని గృహాలు, దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. వ్యర్థాలు కాలువలోకి వదులుతున్నారు. దుకాణాదారులు, కూరగాయలు, చేపలు, చికెన్ వ్యాపారులు వ్యర్థాలను, ఇళ్ల నుంచి చెత్తాచెదారం కాలువలోనే పారబోస్తున్నారు. దీంతో కాలువ పూడిపోయింది. నీరు సక్రమంగా ప్రవహించక పలచోట్ల కాలువ కట్టలు బలహీన పడి తెగిపోయి నీరు వృథా అవుతోంది. చివరి భూములకు నీరందక పంటలు చేతికి వచ్చే సమయంలో ఎండిపోతున్నాయి.

3735 ఎకరాల సాగు..

పట్టణంలో కాలువ పూడిపోవడంతో పంటల సీజన్‌లో ఎన్ఎస్‌పీ అధికారులు నీటి ప్రవాహాన్ని తగ్గిస్తున్నారు. దీంతో చివరి భూములకు నీరందకపోవడంతో పాటు బోర్లు, బావులు ఎండిపోతున్నాయి. దీంతో మూసీనదిపై ఆధారపడి పంటలను సాగు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా నాగార్జునసాగర్ ఎడమ కాలువకు నీటిని విడుదల చేసిన సమయంలో కాలువలోని చెత్తాచెదారం నీటి ప్రవాహానికి అడ్డుపడి పట్టణంలో గృహాలు జలమయమవుతున్నాయి. ఎన్ఎస్‌పీ అధికారులు కాలువ నీటి విడుదల సమయంలో పూడికతీత పనులు చేపట్టకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంటోందని రైతులు, పట్టణవాసులు ఆరోపిస్తున్నారు. ఆర్- 3 జాన్‌పహాడ్ మేజర్ కాలువ నేరేడుచర్ల పట్టణం నుంచి మూసీ ఒడ్డు తండా వరకు 3735 ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంటుంది. దీంతో రైతులే పొలాలు నాట్ల సమయంలో నీటి కోసం స్వచ్ఛందంగా జేసీబీలతో పూడికతీత పనులు చేపడుతున్నారు.

ఆధునీకరణకు నిధులు మంజూరైనా..

పట్టణంలో ఆక్రమణదారులు కాలువలో వ్యర్థాలను వేస్తుండటంతో అవన్నీ పొలాల్లోకి చేరి దుర్వాసన వెదజల్లుతుందని, పొలాల పనులు చేసే సమయంలో అస్వస్థతకు గురి అవుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువలోని నీటిని పశువులు, మనుషులు తాగే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. ఆర్-3 కాలువ ఆధునీకరణ కోసం గత ఏడాది ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా నేటికీ పనులు చేపట్టలేదు. ఇప్పటికైనా ఆధునీకరణ పనులు చేపట్టి కాలువకు ఇరువైపులా ఆక్రమణలను తొలగించి కాలువలో చెత్త, చెదారం వేయకుండా చూడాలని రైతులు ఎన్ఎస్‌పీ అధికారులను కోరుతున్నారు.

చివరి భూములకు నీరందేలా చూడాలి

ఆర్- 3 కాలువకు మరమ్మతులు చేపట్టి కాలువ చివరి భూములకు నీరందేలా చూడాలి. కాలువకు ఇరువైపులా ఆక్రమణలకు తొలగించాలి. పట్టణం నుంచి వచ్చే కాలువలో వ్యర్థాలు వేయకుండా ఎన్ఎస్‌పీ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.

– కసిరెడ్డి మాధవరెడ్డి, రైతు, నేరేడుచర్ల

పూడికతీత పనులు చేపడతాం

ఆర్- 3 కాలువలో పూడికతీత పనులను వెంటనే చేపడతాం. కాలువ ఆక్రమించిన గృహ యాజమానులు, వ్యాపారులకు నోటీసులను జారీ చేస్తాం. కాలువలోకి వ్యర్థాలు వేయకుండా చూస్తాం. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్నందున కాలువ ఆధునీకరణ పనులను వచ్చే ఏడాది చేపడతాం.

– నవీన్, ఎన్ఎస్‌పీ ఏఈ, నేరేడుచర్ల

భూ సమస్యలపై దరఖాస్తు చేసుకోవాలి

- కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ


అనంతగిరి : వాయిలసింగారంలో మాట్లాడుతున్న కోదాడ ఆర్డీవో సూర్యనారాయణ

అనంతగిరి : భూభారతి చట్టంతో భూసమస్యలు పరిష్కారం అవుతాయని కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ అన్నారు. బుధవారం మండలంలోని వాయిలసింగారంలో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సును ఆర్డీఓ సందర్శించి దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దీర్ఘకాలంగా ఉన్న భూ సమస్యలపై రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.హిమబిందు, ఆర్ఐ వెంకటనగేష్, సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ మాధవి పాల్గొన్నారు.

భూభారతిలో సమస్యలు పరిష్కారం

మోతె : భూభారతి చట్టంతో రైతుల భూ సమస్యలు పరిష్కారమవుతాయని మోతె తహసీల్దార్ ఎం.వెంకన్న అన్నారు. బుధవారం మండల కేంద్రంతో పాటు ఉర్లుగొండ గ్రామాల్లో జరిగిన భూ భారతి రెవెన్యూ గ్రామ సదస్సుల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నాలుగు లేబర్ కోడ్స్ రద్దయ్యే దాకా పోరాటం

- టీయూసీఐ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్ఎల్ పద్మ


మహాసభలో మాట్లాడుతున్న టీయూసీఐ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్ఎల్ పద్మ

హుజూర్‌నగర్ : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ రద్దయ్యే దాకా పోరాటం కొనసాగిస్తామని ట్రేడ్ యూనియన్స్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్ఎల్ పద్మ స్పష్ట చేశారు. బుధవారం హుజూర్‌నగర్‌లోని వర్తక సంఘం భవనంలో నిర్వహించిన టీయూసీఐ జిల్లా ప్రథమ మహాసభల్లో ఆమె మాట్లాడారు. కార్మిక వర్గం కొట్లాడి సాధించుకున్న హక్కులను కాలరాస్తూ ఎనిమిది గంటల పని విధానాన్ని 12 గంటలకు పెంచుతూ నిర్ణయం తీసుకోవడం అన్యాయం అని అన్నారు. సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన అన్ని పోరాటాలకు తమ సంఘం అండగా ఉంటుందన్నారు.తొలుత టీయూసీఐ అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్ జెండా ఆవిష్కరించారు. కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గొడ్డలి నర్సయ్య, కార్యదర్శిగా ఎస్.డీ . హుస్సేన్, ఉపాధ్యక్షుడిగా గులాం హుస్సేన్, సహాయ కార్యదర్శిగా గోగుల వీరబాబు, కోశాధికారిగా ఐతరాజు వెంకన్న, తొమ్మిది మంది సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కారింగుల వెంకన్న, కొత్తపల్లి రేణక, ఎర్ర అఖిల్ కుమార్, పేర్ల నాగయ్య, గోగుల వీరబాబు, రజాక్, కర్నాకర్, రమేష్, వాజిద్, గులాం హుస్సేన్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచాలి

- జెడ్పీ డిప్యూటీ సీఈఓ శిరీష


మాధవరంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ డిప్యూటీ సీఈఓ శిరీష

మునగాల : మండల వ్యాప్తంగా గల అంగన్‌వాడీ కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచాలని జెడ్పీ డిప్యూటీ సీఈఓ బి.శిరీష సూచించారు. బుధవారం మండలంలోని నర్సింహులగూడెం, రేపాల, మధవరం గ్రామాల్లో గల అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 'అమ్మమాట – అంగన్‌వాడీ బాట'కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. అనంతరం నర్సరీలను పరిశీంచారు. రేపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకుంటున్న ముందస్తు చర్యలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులపై గ్రామాల్లో ప్రజలను చైతన్యపరిచేందుకు అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. ఆమె వెంట ఎంపీడీఓ కె.రమేష్‌దీనదయాళ్, ఎంపీఓ నరేష్, గ్రామపంచాయతీల కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం


స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

గరిడేపల్లి : మండలంలోని పాత అప్పన్నపేట గ్రామంలో పద్మావతి అలివేలుమంగమ్మ సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం స్వామివారి శాంతి కల్యాణ మహోత్సవాన్ని ఆలయ అర్చకులు అలహరి నరసింహాచార్యులు ఆధ్వర్యంలో వేద పండితులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి మంగళస్నానాలు, అభిషేకం చేశారు. సుప్రభాత సేవ, అలంకరణ, ప్రబోధిత ఆరగింపు, మూల విరాట్లకు అభిషేకం, అలంకరణ, సహస్ర కుంకుమార్చన, ఎదుర్కోలు అనంతరం స్వామివారి కల్యాణాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన చేశారు. నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి


నూతన కార్యవర్గ సభ్యులను అభినందిస్తున్న బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు

చిలుకూరు : గ్రామాల్లో బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పోకల వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం చిలుకూరు మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ మండల నూతన కార్యవర్గం సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పారెల్లి మహేష్, మండల నాయకులు తిపిరిశెట్టి బసవయ్య, వన్నాపురం సతీష్, భాగ్యరేఖ, మీసాల మట్టయ్య, కొడారు రాము, కొండా శ్రీను, నరేష్, రాంబాబు, నందీష్, వెంకటేశ్వర్లు, నాగచారి, అనిల్, పాండు, మణిదీప్, కోటేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటనరసింహారెడ్డి మృతి బాధాకరం


వెంకటనరసింహారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

మునగాల : మండల కేంద్రానికి చెందిన రిటైర్డు ఉపాధ్యాయుడు, రిటైర్డు ఉపాధ్యాయుల సంఘం నాయకుడు కొప్పుల వెంకటనరసింహారెడ్డి (85) ఆకస్మిక మృతి బాధాకరమని పలువురు సీపీఎం నాయకులు అన్నారు. ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన వెంకటనరసింహారెడ్డి దశదినకర్మ బుధవారం ఆయన నివాసంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటనరసింహారెడ్డి చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, దేవరం వెంకటరెడ్డి, పార్టీ మండల కార్యదర్శి బుర్రి శ్రీరాములు, షేక్ సైదా, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కిన్నెర వెంకన్న, డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి గడ్డం వినోద్, సామాజిక కార్యకర్త గంధం సైదులు పాల్గొన్నారు.

వెంకటనరసింహారెడ్డి మృతి తీరని లోటు

రిటైర్డు ఉపాధ్యాయుడు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు కొప్పుల వెంకటనరసింహారెడ్డి మృతి పార్టీకి తీరని లోటని పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. వెంకటనరసింహారెడ్డి దశదినకర్మ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుమారులు మట్టారెడ్డి, జైపాల్‌రెడ్డిని పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ఎలక నరేందర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొలిశెట్టి బుచ్చిపాపయ్య, పార్టీ మండల నాయకులు పనస విజయ్‌కుమార్, గన్నా నరసింహారావు, వల్లోజు శ్రీను పాల్గొన్నారు.

బీటీ- 3 పత్తి విత్తనాలు విత్తొద్దు

మునగాల : రైతులు బీటీ- 3 పత్తి విత్తనాలు విత్తొద్దని మండల వ్యవసాయాధికారి బుంగా రాజు తెలిపారు. బుధవారం మండలంలోని నర్సింహులగూడెం, జగన్నాథపురం, మునగాలలో పత్తి విత్తనాల దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. ప్రభుత్వం నిషేధించిన బీటీ- 3 పత్తి విత్తనాలను కొందరు రైతులు ఇతర రాష్ట్రాల నుంచి కొనుగోలు చేసి తమ భూముల్లో విత్తుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, బీటీ- 3 విత్తనాలు విత్తిన వారికి, ఆ భూములలో పనిచేసిన వారందరికీ క్యాన్సర్, చర్మ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. కావున బీటీ-3 విత్తనాలు అమ్మినా, కొనుగోలు చేసిన చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. బీటీ- 3 పత్తి విత్తనాలు ఎవరైన విక్రయించినట్లు తెలిస్తే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో డీలర్లు రామిరెడ్డి, శ్రీశైలం, సైదులు, రాజేష్ పాల్గొన్నారు.

దేవాలయాల వార్షికోత్సవం


పూజలో పాల్గొన్న ఆలయ చైర్మన్, తదితరులు

మఠంపల్లి : మండలంలోని పాతదొనబండతండాలో సీతారామ, లక్ష్మణ, ఆంజనేయ, ముత్యాలమ్మ, బొడ్రాయి, గ్రామ దేవతల ఆలయాల వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి పూజ, అగ్నిహోమం, నవగ్రహ పూజ తదితర పూజా కార్యక్రమాలను అర్చకులు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బానోతు చిన్నానాయక్, వైస్ చైర్మన్ భూక్యా గోదావరి నాయక్, స్థానికులు పాల్గొన్నారు.

ఉత్తమ పాఠశాలలకు అవార్డులు ప్రదానం


మునగాల : కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న హెచ్ఎం అన్నపూర్ణ


హుజూర్‌నగర్‌రూరల్ : కలెక్టర్ నుంచి అవార్డు అందుకుంటున్న హెచ్ఎం గోవర్ధన్

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని అమరవరం ప్రాథమిక పాఠశాల సూర్యాపేట జిల్లాలో ఉత్తమ పాఠశాలగా ఎంపికైంది. బుధవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన బడిబాట సమీక్ష సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్‌తో కలిసి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్.. పాఠశాల హెచ్ఎం శానం గోవర్ధన్‌ను సత్కరించి అవార్డు, ప్రశంసాపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ భూక్యా సైదానాయక్ మాట్లాడుతూ.. 2024-25 విద్యా సంవత్సరానికి గాను చక్కటి పనితీరు, విద్యార్థుల ప్రగతిలో జిల్లాలో అమరవరం ప్రాథమిక పాఠశాల ఉత్తమ పాఠశాలగా ఎంపికై తృతీయ స్థానంలో నిలిచినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం పెనుగొండ శ్రీనివాస్, ఉపాధ్యాయులు విజయ్‌కుమార్, పురుషోత్తంరావు, సోమశేఖర్, నాగరాజు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ వజ్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

కొక్కిరేణి ప్రాథమిక పాఠశాల ఎంపిక

మునగాల : మండలంలోని కొక్కిరేణిలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉత్తమ పాఠశాలగా ఎంపికైంది. ఈ మేరకు బుధవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, జిల్లా విద్యాధికారి ఏ.అశోక్ చేతుల మీదుగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తమ్మళి అన్నపూర్ణ అవార్డు అందుకున్నారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచడంతో పాటు పాఠశాల పరిశుభ్రత, మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించడం, తదితర అంశాలలో మండలంలోనే కొక్కిరేణి పీఎస్ మొదటి స్థానంలో నిలవడంతో ఈ అవార్డు దక్కింది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అడిదెల వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బెస్ట్ ప్రాక్టీస్ స్కూళ్లకు అవార్డులు


నడిగూడెం : పదవ తరగతి టాపర్ నజ్మీన్‌కు ప్రశంసాపత్రం అందజేస్తున్న కలెక్టర్

నడిగూడెం : నడిగూడెం బాలికల ఉన్నత పాఠశాల, సిరిపురం ప్రాథమిక పాఠశాలలు బెస్ట్ ప్రాక్టీస్ స్కూళ్లుగా ఎంపికయ్యాయి. ఈమేరకు బుధవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ చేతుల మీదుగా అవార్డులను ఆ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అరుణ, ప్రవీణ అందుకున్నారు. అదేవిధంగా 2024- 25 విద్యా సంవత్సరంలో 10వ తరగతిలో మండల టాపర్‌గా నిలిచిన నడిగూడెంకు చెందిన షేక్.నజ్మీన్‌ను కలెక్టర్ అభినందించి, ప్రశంసాపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి ఉపేందర్‌రావు, శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'అమ్మ మాట, అంగన్‌వాడీ బాట'


నడిగూడెం : సిరిపురంలో ర్యాలీలో పాల్గొన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామస్తులు

నడిగూడెం : మండల పరిధిలోని సిరిపురంలో శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం అమ్మ మాట- అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఐదేళ్ల లోపు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలంటూ ప్రచారం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాంపల్లి సతీష్‌కుమార్, అంగన్‌వాడీ కార్యకర్తలు శైలజ, శ్రీలక్ష్మి, నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలి

హుజూర్‌నగర్ : 30 నెలలు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని అంగన్‌వాడీ టీచర్ రంగమ్మ కోరారు. బుధవారం హుజూర్‌నగర్‌లోని 1వ కేంద్రంలో అమ్మ మాట – అంగన్‌వాడీ బడిబాట నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా, అంగన్‌వాడీ పలువురు తల్లులు పాల్గొన్నారు.

గానుగబండలో..

గరిడేపల్లి : చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని అంగన్‌వాడీ టీచర్ పోకల వెంకమ్మ కోరారు. బుధవారం మండలంలోని గానుగబండలో నిర్వహించిన అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో అమరవరపు సత్యావతి, జంగం అనిత, ఏఎస్ఎం శాంత, ఆశా కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం చేయాలి


ఏరువాక కార్యక్రమంలో పాల్గొన్న సిరి ఫౌండేషన్ సభ్యులు, కార్యదర్శి, రైతులు

నడిగూడెం : రైతులు తమ కుటుంబ అవసరాల కోసం ఒక అర ఎకరంలో ప్రకృతి వ్యవసాయం చేయాలని కరివిరాల పంచాయతీ కార్యదర్శి అన్వర్ కోరారు. బుధవారం మండలంలోని కరివిరాల ఆవాస గ్రామం వెంకట్రాంపురంలో సిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఏరువాక కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సిరి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ గోపయ్య, పీఎస్‌పీ ప్రతినిధులు దున్నా రాజు, పేరెల్లి ఉపేందర్, రైతులు బాదె సోమయ్య, చిత్తలూరి శ్రీనివాసరావు, చిత్తలూరి లక్ష్మయ్య, చిత్తలూరి వెంకటేశ్వర్లు, దనియాకుల కృష్ణమూర్తి, దోసపాటి లింగయ్య, ప్రమీల, నర్సమ్మ, పద్మ పాల్గొన్నారు.

తాతయ్య జన్మదినం.. కుటుంబమంతా సంబరం


వందేళ్ల వృద్ధుడు కోటయ్య జన్మదిన వేడుకలో కుటుంబ సభ్యులు

నడిగూడెం : మండలంలోని చాకిరాలలో వందేళ్ల వృద్ధుడు గరిడేపల్లి కోటయ్య జన్మదిన వేడుకలను బుధవారం కుటుంబ సభ్యుల సమక్షంలో ఘనంగా జరుపుకున్నారు. ఆయనకు ఇద్దరు కుమారులు, నలుగురు కూతుర్లు ఉన్నారు. వారి కొడుకులు, కూతుర్లతో పాటు మనుమలు, మనుమరాళ్లు మొత్తం 99 మంది కుటుంబసభ్యులు కోటయ్య జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డ కుటుంబ సభ్యులంతా ఒకే చోట చేరి రోజంతా ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో ఆయన కూతుర్లు లక్ష్మి, వెంకటరమణ, గురవమ్మ, సక్కుబాయి, కుమారులు వెంకటేశ్వర్లు, రాములు, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

సీఐజీ గ్రూప్‌ల ఏర్పాటుకు సర్వే చేయాలి

నేరేడుచర్ల : సమభావన సంఘాల్లో నిరుపేదలు, వీధి వ్యాపారుల్లో కామన్ ఇంట్రెస్టెడ్ గ్రూప్ (సీఐజీ) గ్రూప్‌ల ఏర్పాటుకు సర్వే చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ యడవల్లి అశోక్‌రెడ్డి తెలిపారు. నేరేడుచర్ల మున్సిపాలిటీలో వంద రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా 11వ వార్డులో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తడి, పొడి చెత్త ఏ విధంగా వేరు చేయాలో ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మహిళా సంఘాల సభ్యులు, మున్సిపల్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

డీఎస్ఆర్ యాప్‌పై కార్యదర్శుల నిరసన


ఎంపీఓకు జీపీ ట్రాక్టర్ల తాళాలు అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

చిలుకూరు : గ్రామ పంచాయతీల్లో చేపట్టే పారిశుద్ధ్య నిర్వహణ నివేదికను రోజువారీ పారిశుద్ధ్య నివేదిక (డీఎస్ఆర్) యాప్‌లో ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలనే ప్రభుత్వ మార్గదర్శకాలపై చిలుకూరు మండల పంచాయతీ కార్యదర్శులు నిరసన తెలిపారు. యాప్‌ను రద్దు చేయాలని బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల పంచాయతీ అధికారి ముక్కపాటి నరసింహారావుకు పంచాయతీ కార్యదర్శులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నూతన యాప్‌తో తమపై పని భారంతో పాటు ఆర్థిక భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీఓకు జీపీ ట్రాక్టర్ తాళాలను అందజేశారు. తమ సమస్యలను పరిష్కరించేవరకు ట్రాక్టర్ నిర్వహణ నిలిపివేస్తామని, యాప్‌లో వివరాలు అప్‌లోడ్ చేయమని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

నిత్యావసర సరుకులు అందజేత

నడిగూడెం : మండల కేంద్రానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు పల్లపు శ్రీను గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. బాధితుడుది నిరుపేద కుటుంబం. దీంతో బుధవారం నడిగూడెంకు చెందిన సామాజిక కార్యకర్త జయ సీతారామ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు వల్లెపు శ్రీనివాస్ 25 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులను అందజేశారు. పల్లపు తిరుమలేష్, గుంజ తిరుమలేష్, దేవరంగుల రాము, గుంజ మురళి, గుంజ రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

చిలుకూరు : చిలుకూరుకు చెందిన పలువురు లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బుధవారం కాంగ్రెస్ నాయకులు అందజేశారు. వారు మాట్లాడుతూ.. పేదలకు ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు.